తెల్లవారింది. నోట్లో వేపపుల్లలు పెట్టుకుని మగవారూ, చెంబులు పట్టుకుని ఆడ వాళ్ళూ ఇళ్ళల్లోంచి బయటికి వచ్చేశారు.

ఆవిధంగా వచ్చిన వాళ్ళు సామాన్యంగా అంత తొందరగా తిరిగి ఇంట్లోకి వెళ్ళరు. నిన్న రాత్రి భోజనాలు అయిన దగ్గర్నించే తెల్లవారి కోడికూసే లోపల ఏం వింతలూ విడ్డూరాలూ జరిగాయో వైనవైనాలుగా చెప్పుకోవాలి. అప్పుడు ఇంటి మొహం పట్టేది.

అందులోనూ ఆవేళ బ్రాహ్మణ వీధిలో కాస్త సందడిగా వుంది. రాజమ్మగారు ఇంటి అరుగు



# బంగాళాదుంపల తగాదా

పొత్తూరి విజయలక్ష్మి

మీద నిలబడి ఆవేశంగా మాట్లాడుతోంది.

చుట్టూ చేరిన వాళ్ళు శ్రద్ధగా వింటున్నారు.

''ఏవిటీ? నిజమే. అంత మాటన్నాడా?''

''పిదపకాలం పిదప బుద్ధులూనూ''

''ఆవిడ వయసులో ఆరోవంతు లేదు వాడికి. ఎంత ధైర్యం?'' అంటూ బుగ్గలు నొక్కుకుంటున్నారు.

''ఎవర్ననీ ఏం లాభం లేమ్మా. అంతా నా ఖర్మ. ఏ దిక్కూ లేనిదాన్నని అందరికీ నేనంటే అలుసే. అసలానాడే మా ఊరు పోయుంటే బావుండేది'' రాజమ్మగారి కంఠం బరువెక్కింది.

''అంతమాటెందుకు వదినా. నీకిక్కడ ఏం తక్కువయిందని?'' ఓదార్చింది శాస్తుర్లుగారి భార్య.

''ఆవిడ బాధపడిందంటే పడదూ మరి! నువ్వు లక్ష చెప్పు. ఈ మధ్య మన ఊళ్ళో ప్రతివాడికీ కొమ్ములొచ్చేస్తున్నాయి. భయం భక్తీ లేకుండా పోతోంది. ఊరి కరణం గారు ధర్మరాజు. ఆయన అలుసు చూసుకుని పేట్రేగి పోతున్నారు జనం'' అంది శ్రీలక్షుమ్మ.

అక్కడే వున్న కరణంగారి భార్య కామాక్షమ్మకి కష్టం వేసింది. ''ఇది మరీ బావుంది. ఉరుము ఉరిమి మంగలం మీద పడిందనీ మధ్యలో ఆయనేం చేస్తారు?'' అంది నిష్టూరంగా.

''ఆయనకి కాకపోతే ఇంకెవరు చేస్తారు? అందర్నీ క్రమశిక్షణలో వుంచవలసిన బాధ్యత ఆయనది కాదా'' అంది మరో ఇల్లాలు.

''ఏవిటా కాని కాలం వచ్చిపడింది. ఆ మహాత్ముడే వుండివుంటే గ్రామానికీ అరిష్టం వచ్చేదే కాదు'' అంది శాస్తుర్లుగారి భార్య.

''ఏం చేస్తాం? మన దురదృష్టం. గాంధీగారు లేకపోతేనేం? నెహ్రూగారు లేరా? రాజగోపాలాచారి గారు లేరా? సంజీవరెడ్డిగారు లేరా? నేను వెంటనే గుంటూర్నించీ మా అన్నయ్యని పిలిపిస్తాను. వాడు ఢిల్లీకి చెన్నపట్నానికీ ఉత్తరాలు

రాస్తాడు. వాళ్ళు వెంటనే వచ్చి విషయం పరిష్కారం చేస్తారు అంది శ్రీలక్ష్మమ్మ.

ఆవిడ అన్నగారు గుంటూర్లో ప్లీడరు. అన్ని విషయాలూ తనకి తెలుసు ననుకుంటుంది ఆవిడ. ఆవిడకి అన్నీ తెలుసు అనుకుంటారు ఊళ్ళోవాళ్ళు.

బావిలో పూడిక తీసేవాడు రాకపోయినా, మాట్లవాడు గిన్నెలు సరిగ్గా మాటు వెయ్యకపోయినా ఢిల్లీకి ఉత్తరం రాస్తానంటుంది ఆవిడ.

ఢిల్లీ ఉత్తరం అంటే అందరికీ హడలు.

అప్పుడూ అంతే అయింది. ఢిల్లీ అనేసరికి కరణంగారి భార్యకి భయం వేసింది.

"ఈ మాత్రం దానికి అంతదాకా ఎందుకులే వదినా? మా అన్నయ్యగారికి నేను చెప్తానులే" అంది.

"దొంగలు పడిన ఆరునెలలకి కుక్కలు మొరిగినట్లు ఎప్పుడో చెప్తానంటే కాదు. ఈ వ్యవహారం ఏమిటో ఇవ్వాళే తేలిపోవాలి" అంది రాజమ్మగారు ఖచ్చితంగా.

"అట్లాగేలే ఆమాటే చెప్తాను" హామీ ఇచ్చింది కరణంగారి భార్య.

హామీ ఇచ్చి ఇంటిముఖం పట్టింది.

రాజమ్మగారు మాత్రం అరుగు మీదే వుంది. చుట్టూ గుమికూడిన వారికి కొంత మంది వెళ్తున్నారు. కొత్తవాళ్ళు వచ్చి చేరుతున్నారు.

అదో మారుమూల పల్లెటూరు. రెండుమైళ్ళు నడిచి వెళ్ళి బస్సు ఎక్కితే గానీ బయట ప్రపంచం కనిపించదు.

పాడీ పంటా పుష్కలంగానే వున్నాయా గ్రామంలో. గుడీ గోపురమూ వున్నాయి. వీధి బడీ, పోస్టాఫీసనే బడీ అరుగు కూడా వున్నాయి.

ఆ ఊరిజనానికి కావలసినంత పనీ, బోలెడంత తీరికా వున్నాయి. స్వాతంత్ర్యం వచ్చిన ఆనందం, గాంధీగారు పోయిన దుఃఖం కలిసి అనుభవిస్తున్న రోజులవి.

ఆ ఊళ్ళో సామాన్యంగా గొడవలూ దెబ్బలాటలూ జరగవు. జరిగిందంటే మాత్రం ఊరందరికీ కావలసినంత కాలక్షేపం.

ఆర్నెల్ల క్రిందట నంది నరసయ్యగారి అమ్మాయిని కాపురం తీసుకువెళ్ళే విషయంలో తగాదా వచ్చింది. పెళ్ళికి పెడతామని చెప్పిన బంగారంలో తక్కువ పెట్టారని అత్తవారు అలిగి కోడల్ని పుట్టింటికి పంపేశారు. పుట్టిల్లంటే అదేం యోజనాలు దూరం లేదు. ఆ ఇంటికీ ఈ ఇంటికీ మధ్య మూడిళ్ళుంటాయి అంతే.

అత్తారింటినించి వచ్చిన కూతుర్ని మర్నాడు పొద్దున్నే పెరుగన్నం పెట్టి అత్తారింట్లో దిగవిడిచి వచ్చారు పుట్టింటివారు. ఆ సాయంత్రమే మళ్ళీ పుట్టింటికి వెళేశారు అత్తారు.


ఆవిధంగా ఆ అమ్మాయి ఆ రెండిళ్ళ మధ్యా తిరుగుతూ విసుగేస్తే ఏ పక్కింట్లోనో అచ్చనగాయలు ఆడుకుంటూ రోజులు వెళ్ళదీసింది. చివరికానాడు పెద్ద తగాదా అయిపోయి మా పిల్లవాడికి మళ్ళీ పెళ్ళి చేస్తాం అన్నాడు పిల్లవాడి తండ్రి.

పిల్లతండ్రి పంచాయితీ పెట్టాడు. "అంతా విని అఘోరించి మొహం కడుక్కున్నట్లు వుంది. నవర్సు బంగారం కోసం కోడల్ని కాదంటారా? నిదానంగా పెడతాడులే బంగారం. ఆయనెక్కడికి పోతాడు? నువ్వెక్కడికి పోతావు. అదృష్టం బావుంటే వచ్చే ఏడాది నీ మనవడికి పెడతాడు ఆ బంగారం. ఇహ నువ్వనవసరంగా గొడవ చెయ్యకు" అని మందలించి పంపేశారు కరణంగారు.

మళ్ళీ ఇన్నాళ్టికి ఇవ్వాళే తగవు. గబగబా పనులు తెముల్చుకుని కరణంగారి ఇంటిముందు చేరారు జనం.

వాది రాజమ్మగారు అప్పటికి ఎప్పుడో వచ్చి కూర్చుంది.

ప్రతి వాది సుబ్బారావే రావాలి. కబురు పంపించారు. రోడ్డుమీదికి వెళ్ళాడు సరుకుకోసం. రాగానే వస్తాడని చెప్పారు ఇంట్లోవాళ్ళు.



సుబ్బారావు తండ్రి వెంకట్రావు మాత్రం వచ్చి ఓ మూల కూర్చున్నాడు.

"సమయానికి నేనింట్లో లేను. రాంభజన మందిరం దగ్గరికి రేడియో విందామని తగలడ్డాను. ఏం జరిగిందో నాకు తెలియకపాయె. ఇక నేనేం మాట్లాడను?" అన్నాడు.

జరిగినది అంతా అప్పటికి ఒకటికి పదిసార్లు విన్నారు అందరూ.

రాజమ్మగారంటే అందరికీ అభిమానమే. ఆ ఊళ్ళోనే పుట్టి పెరిగింది. తల్లిదండ్రులకు ఒక్కగా నొక్క కూతురు. మూడేళ్ళ వయసులో వివాహం అయింది. ఎనిమిదో ఏట శ్రావణ మాసం పూజ చేసుకుని ముత్తైదువులని పేరంటం పిలవాలని లక్షణంగా పట్టుబట్టలు కట్టుకుని ఒంటెడు నగలూ పెట్టుకుని గుమ్మం దాటే సరికి ఎదురొచ్చాడు అత్తారింటి జీతగాడు.

రాజమ్మగారి భర్త పాముకరిచి పోయాడని వార్త తీసుకుని.

దిక్కుమాలిన ఆస్తి కట్టుకుపోతానా? ఆ ఆస్తి కోసం నా బిడ్డని అక్కడికి పంపను అని ఏడిచాడా తండ్రి. పుట్టింట్లోనే వుండిపోయిందావిడ. తండ్రి ఏనాడోపోయాడు. తల్లికీ తొంభై దాటాయి.

రాజమ్మగారికీ డెబ్బై దాటాయి.

"ఏనాడైనా ఒకరిని ఒక మాట అని ఎరుగునా? ఒకరికింత పెట్టడం తప్పించి ఒకరిదగ్గర ఆశించి ఎరుగునా? అటువంటిది ఆవిడని పట్టుకుని అంత మాటనడానికి ఆ వెధవకెంత ధైర్యం?" అంటూ రాజమ్మగారి పక్షాన మాట్లాడుతున్నారు కొందరు.

ప్రతివాది విషయానికొస్తే పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లు చిన్నవాడైనా అఖండుడు సుబ్బారావ్.

నిండా ఇరవై ఏళ్ళు లేవు. ఆరేళ్ళనాడు తండ్రి అర్ధాంతరంగా జబ్బుచేసి మంచాన పడితే ఎంత ధైర్యంగా పరిస్థితులను ఎదుర్కొన్నాడు.

ఇటు వ్యాపారం చూసుకుంటూనే ఇద్దరు అక్కలకు పెళ్ళిచేసి పంపించాడు. అసలా వ్యాపార దక్షతకి ముచ్చట వేస్తుంది.

ఊరికే ఇంతింత సరుకు తెచ్చి వృధా చెయ్యడు. అట్లా అని ఏది అడిగినా లేదనడు.

"మొన్న ఏమైందనుకున్నావు పిన్నీ. గుడివాడనుంచీ మా వియ్యపురాలు వచ్చింది. మల్లెపూల కాలం మనవరాలికి చక్రాల జడ వెయ్యాలని ముచ్చటపడింది. తీరా చూస్తే ఊలు ముక్కలు లేవు.

ఇదే మా గుడివాడలో అయితే మనిషిని పంపిస్తే బజారుకి వెళ్ళి మనం పుల్లలకి మొగ్గలు గుచ్చుకునేలోగా పట్టుకొచ్చేవాడు. ఈ శుద్ధ పల్లెటూళ్ళో ఏం దొరుకుతాయి ఏం చేస్తాం? వంకుల జడ వేసి తగలడతాను" అని బడాయి పోయింది.

పోనీ మన సుబ్బారావు కొట్లో వుండేమో అని పంపించాను.

ఊలు ముక్కలతో పాటు నక్కీ ఉండ కూడా పంపించాడు సుబ్బారావు.

మా వియ్యపురాలి మొహం పెంకులా మాడిపోయిందనుకో. మన ఊరి పరువు నిలిపావురా సుబ్బారావూ అన్నాను.

అంటూ సుబ్బారావు పక్షాన మాట్లాడింది ఓ ఇల్లాలు.

దీంతో అక్కడున్న వారంతా రెండు జట్లుగా విడిపోయి మాట్లాడ్డం ప్రారంభించారు. ఎండెక్కుతోంది.

గొడుగేసుకుని వచ్చాడు సీతాపతి గారు. కరణంగారి తర్వాత కరణం గారంతటి వాడు ఆయన. ఆయన్ని చూడగానే కరణం భూషయ్యగారి ప్రాణం లేచివచ్చింది.

''రా బావా! సమయానికి వచ్చావు'' అంటూ ఆహ్వానించాడు.

ఆయన ఊరొదిలి వెళ్ళి రెండ్రోజులైంది.

''ఆ ఏవిటి బావా హడావిడి'' అని అడిగాడు సీతాపతి.

''మన సుబ్బారావు లేడూ! వాడు మన రాజమ్మగారిని నానామాటలూ అన్నాడుట'' చెప్పాడు భూషయ్య.

''సుబ్బారావా? వాడేం చెప్పలేదే. బస్సు దిగి వాడి బండిలోనే నేనొచ్చిందీ! వాడటు వెళ్ళాడు నేనిటు వచ్చాను. ఇంతకీ ఏం జరిగిందట?'' అడిగాడు సీతాపతి ఆశ్చర్యంగా.

''ఇంకేం జరగాలి నాయనా!''అంటూ అరవై ఆరోసారి మొదలుపెట్టింది రాజమ్మగారు.

''నిన్న సాయంత్రం దీపం పెట్టాక కుంపటి వెలిగించి ఇన్ని బియ్యం ఉడకేసుకున్నాను. అమ్మకి అన్నం పెట్టబోయాను. రాజ్యం నాకు బంగాళా దుంప వేపుడు తినాలని వుందే అన్నది మా అమ్మ. పెద్దది. ఈ పూట పడుకుంటే తెల్లవారి లేస్తుందా లేదా నమ్మకం లేదు. పోనీ నోరు తెరిచి అడిగింది కదా అని ఆ చీకట్లో పడి పోయాను సుబ్బారావు కొట్టుకి. ఓ అరవీశె బంగాళా దుంపలివ్వరా అంటే లేవు పొమ్మన్నాడు.

ఎదురుగా చాటలో వున్నాయి దుంపలు. సరుకు వుంచుకుని లేదంటావేంరా అంటే నన్ను నానా మాటలూ అన్నాడు'' అంది రాజమ్మగారు.

''అదేవిటదీ సరుకు వుంచుకుని లేదన్నాడా?'' ఆశ్చర్యపోయాడు సీతాపతి.

''అవునుట బావా! వాడట్లాగే అన్నాడుట. ఈవిడ ఒట్టేసి చెప్తోంది. అదే నిజమయితే వాడికి తగిన శాస్తి చెయ్యాల్సిందే. ఏవిధంగా ఈ తగవు పరిష్కారం చెయ్యాలా అని మధన పడుతుంటే నువ్వు వచ్చావు. నా నెత్తిన పాలుపోసినట్లు అయిందనుకో'' అన్నాడు భూషయ్య.

''వాడిని రానీ. అడిగి తెలుసుకుందాం'' ధైర్యం చెప్పాడు సీతాపతి.

అడుగో సుబ్బారావు వస్తున్నాడనే వర్తమానం అందింది. అంతా కలకలం. సుబ్బారావు రానేవచ్చాడు.

''రారా!రా! నిన్న వాగిన వాగుడంతా ఇప్పుడు పెద్దమనుషులముందు వాగరా!'' అని హూంకరించింది రాజమ్మగారు.

సుబ్బారావు తెల్లబోయాడు. ''నేనేం అన్నానే మామ్మా నిన్ను?'' అన్నాడు అమాయకంగా.

''చేసేదంతా చేసి ఆ నటన చూడండి'' అన్నారు రాజమ్మ పక్షం వాళ్ళు.

''మీరాగండి నన్ను మాట్లాడనివ్వండి'' అని గదిమేరు భూషయ్యగారు.

'' ఏరా సుబ్బారావ్! నిన్న సాయంత్రం ఆవిడొచ్చి బంగాళా దుంపలు ఇమ్మంటే లేవు పొమ్మన్నావుట'' విచారణ ప్రారంభం అయింది.

''అవును అన్నాను'' చెప్పాడు సుబ్బారావు.

''చూశారా చూశారా నే చెప్పలే'' లబలబలాడింది రాజమ్మ.

''సరుకు వుంచుకుని లేదనటం తప్పుకదురా! అందులోనూ పెద్దావిడ పడుతూ లేస్తూ వచ్చి అడిగితే కాదనడం ధూర్త లక్షణం కదూ'' నిలదీశాడు కరణంగారు.

''అదికాదు తాతయ్యా. దుంపలు చూడబోతే కాసినే వున్నాయి. ఇంకా గుంటూరు నుంచి వచ్చే ఆఖరి బస్సు రాలేదు. బస్సు దిగి ఎవరింటికైనా చుట్టం రావచ్చు. అల్లుడు రావచ్చు. వున్న దుంపలు కాసినీ మామ్మకిచ్చేస్తే ఎవరైనా వస్తే ఆఖరిక్షణంలో ఎక్కడికి పరుగులు పెడతాం? అందుకే లేవన్నాను'' అన్నాడు సుబ్బారావు.

''అదీ విషయం. చూశారా వాడి ముందు చూపు. నిజమే మరి ఎవరైనా వస్తే ఇంత కూరముక్కయినా వెయ్యకుండా అన్నం పెడితే మన ఊరి పరువు ఏమైపోవాలి?'' అంది ఇందాక ఊలుముక్కల గురించి మెచ్చుకున్న ఇల్లాలు.

అవునవును అనుకున్నారు అందరూ. అందులో రాజమ్మగారి వైపు వాదించిన వారుకూడా వున్నారు.

రాజమ్మ గతుక్కుమంది.

''మరామాట తిన్నగా చెప్పేడవచ్చుగా. పెద్ద ముండాదాన్ని నన్ను పట్టుకుని ఇప్పుడింత అర్జెంటుగా దుంపలెందుకే మామ్మా. నీకు పెళ్ళి వారొస్తున్నారా? అని వెటకారం ఆడాడు. ఆ వెధవ కూతలెందుకో అడగండి'' ఇంకో పాయింటు లేవనెత్తింది.

''ఏరా ఆ మాట అన్నావా?'' నిలదీశారు కరణంగారు.

''అదేవిటి తాతయ్యా? మామ్మని పరాచికం ఆడడం నాకు కొత్తా? ఆ మాట కొస్తే నిన్న మధ్యాహ్నం నాకొట్టుకొచ్చి మామ్మ ఏరా ఇంకెప్పుడు చేసుకుంటావ్ పెళ్ళి? నీకంతగా ఏ పిల్లా నచ్చకపోతే నన్ను పెళ్ళి చేసుకో. అనలేదా?'' అన్నాడు సుబ్బారావు.

అంతా ఘొల్లున నవ్వేశారు.

రాజమ్మగారు కూడా కోపం నటించబోయి చాతగాక వూరుకుంది.

''ఏమమ్మా ఏమంటావ్! ఏదో చిన్నతనం కుర్రవెధవ'' అన్నాడు సీతాపతి.

''ఇకముందు ఇట్లా చెయ్యద్దని చెప్పండి'' అంది రాజమ్మగారు బింకంగా.

''ఏరా మరీ ఏవంటావు?'' ప్రతివాదిని అడిగారు.

''అట్లాగేలే తాతయ్యా'' అన్నాడు సుబ్బారావ్.

''ఏవమ్మా విన్నావు కదా'' అన్నారు కరణంగారు.

''మామ్మా సరుకొచ్చింది. దుంపలు ఇంట్లో తాతమ్మకి ఇచ్చి వస్తున్నాను. కూరొండుకు తిను'' అన్నాడు రాజమ్మగారితో.

''ఉద్ధరించావులే. కాసేపాగి అటు రా. కూరముక్కలు పెడతాను. నేను చేసిన వేపుడంటే పడి చచ్చిపోతావుగా'' అంది రాజమ్మగారు లేచి ధవళ కిరీటం సర్దుకుంటూ.

అంతా లేచారు.

''బాగానే వుంది సంబడం'' అనుకుంటూ ఇళ్ళకు పోయారు.

